సాక్షి
చిత్తూరు
సోమవారం ı 26 ı ఫిబ్రవరి ı 2024



పెరుమాళ్లపల్లెలో పరుష పందేలు

వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో ఆదివారం జోరుగా పరుష పందేలు నిర్వహించారు. - IIలో



గుర్రపుస్వారీ యాత్ర ప్రారంభం

తిరుపతి ఎన్‌సీసీ నగర్ నుంచి పలువురు క్యాడెట్లు ఆదివారం గుర్రపుస్వారీ యాత్రకు బయలుదేరారు. - IIలో



మంటలు ఆర్పబోయి వ్యక్తి మృతి

గంగవరం మండలం మల్లేరు వద్ద ఓ వాహనానికి అంటుకున్న మంటలను ఆర్పబోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. - IIలో

న్యూస్‌రీల్

మసెమ్మ సేవలో మంత్రి పెద్దిరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు : మండలంలోని కురప్పల్లెలో తొలిసారిగా నిర్వహిస్తున్న మసెమ్మ తల్లి జాతరలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సుమారు 40 గ్రామాల ప్రజలు వైభవంగా జరిపించే జాతరలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అమ్మవారి కరుణాకటాక్షంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు జయరామిరెడ్డి, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రెడ్డెప్ప, శంకరప్ప, నంజుండప్ప పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ అవసరం



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

గంగాధర నెల్లూరు : మామిడి సాగులో సస్యరక్షణ అవసరమని హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని గొల్లపల్లె వద్ద ఉన్న జైన్ ఫామ్ ఫ్రెష్ ఆధ్వర్యంలో మామిడి సాగు చేస్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే మామిడి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పిందె దశలో మామిడిని ఆశించే తెగుళ్ల నివారణను రైతులకు వివరించారు. సమావేశంలో జైన్ ఫామ్ ఫ్రెష్ మేనేజర్ సమీర్ శర్మ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్ బాబు, పీఆర్‌ఓ చంద్రకుమార్ పాల్గొన్నారు.

జన్యారణంలోకి జింక



జింకను నగరవనంలో వదిలిపెడుతున్న సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని గిరింపేటకు ఆదివారం సమీప అటవీ ప్రాంతం నుంచి ఓ జింక వచ్చింది. కుక్కలు దాడికి దిగడంతో స్థానికులు, మున్సిపల్ సిబ్బంది కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం ఫారెస్ట్ సిబ్బంది జింకను జీపులో తీసుకెళ్లి నగరవనంలో వదిలిపెట్టారు.

నేటి 'స్పందన' రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కుప్పం పర్యటనకు విచ్చేస్తున్నందున కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

పోలీస్ స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ జాషువా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నేటి స్పందనను రద్దు చేసినట్లు వెల్లడించారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సీఐ కృష్ణారెడ్డి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు కల్పించారు.

ఇది కదా.. అభివృద్ధి

కుప్పంలో కృష్ణమ్మ పరవళ్లు



హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి , ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

ఏళ్ల తరబడి ఎదురుచూపులకు ఫలితం దక్కుతోంది. దశాబ్దాల నీటి కష్టాలకు తెరపడుతోంది. కొండలు.. గుట్టలు దాటి కృష్ణమ్మ వడివడిగా ఉరుకుతోంది. కరువు సీమను సస్యశ్యామలం చేసేందుకు పరవళ్లు తొక్కుతూ వస్తోంది. నేడు రామకుప్పం మండలం రాజుపేట వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా కుప్పం దాహార్తిని తీర్చేందుకు ఉప్పొంగుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజానీకం ప్రశంసల జల్లు కురిపిస్తోంది. ఇచ్చిన మాట చెల్లించిన జననేతకు కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ఇన్నేళ్లు మోసినా చంద్రబాబు చేయలేని మహత్కార్యాన్ని సాధించినందుకు అభినందన మందారమాలలు సమర్పిస్తోంది.

- దశాబ్దాల కల సాకారం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న కుప్పంవాసులు
- సాగు.. తాగునీటి కష్టాలు తీరుస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- నేడు కుప్పం పర్యటనకు విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- రాజుపేట వద్ద హంద్రీ-నీవా జలాలు చెరువులకు విడుదల

సాక్షి, చిత్తూరు/కుప్పం : కుప్పం ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. ఎట్టకేలకు కృష్ణా జలాలు చేరుకున్నాయి. 2022 సెప్టెంబర్ 23వ తేదీన కుప్పంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సోమవారం ఈ మేరకు రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా ప్రాజెక్టులోని కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణాజలాలను నియోజకవర్గంలోని చెరువులకు విడుదల చేయనున్నారు.

ఉప కాలువ వివరాలు ఇవీ..

హంద్రీ-నీవా ప్రాజెక్టులోని పుంగనూరు ఉప కాలువ 201.8వ కిలోమీటర్ అప్పినపల్లె వద్ద కుప్పం బ్రాంచ్ కెనాల్ ప్రారంభమవుతుంది. 8 మండలాల మీదుగా 123.641 కిలోమీటర్లు సాగుతుంది. ఈ మార్గంలో 3 ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు ఈ కాలువలో ప్రవహించేలా రూపకల్పన చేశారు. కుప్పం నియోజకవర్గంలోని చిట్టచివరిదైన పరమసముద్రం చెరువు వరకు నీరు సరఫరా చేసేలా కాలువను తీర్చిదిద్దారు. కాలువ ద్వారా 8 మండలాల్లోని 4.02 లక్షల జనాభాకు నీటి సరఫరా చేయనున్నారు. మొత్తం 110 చెరువుల ద్వారా 6,300 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించనున్నారు.



రాజుపేట వద్ద కృష్ణా జలాల విడుదల ట్రయల్ రన్

నీరందించనున్న చెరువుల సమాచారం

మండలం	చెరువుల సంఖ్య
పెద్దపంజాణి	01
గంగవరం	05
బైరెడ్డిపల్లె	08
వి.కోట	24
రామకుప్పం	07
శాంతిపురం	25
గుడుపల్లె	27
కుప్పం	18
మొత్తం	110

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మాది వ్యవసాయ కుటుంబం. గతంలో నీటి లభ్యత లేని కారణంగా వ్యవసాయం కష్టతరంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ- నీవా కాలువ నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు కరువుతో తల్లడిల్లిన కుప్పం నియోజకవర్గం ఇకపై సస్యశ్యామలం అవుతుంది. మాకు నీరు అందించి బతుకుదెరువు కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – నారాయణప్ప, కొలమడుగు, శాంతిపురం మండలం

మళ్లీ గెలిపించుకుంటాం



రైతుల కష్టం తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. గతంలో పుస్తెలు తాకట్టు పెట్టి బోర్లు వేసుకున్నా నీరు పడే పరిస్థితి ఉండేది కాదు. ఇకపై ఆ కష్టాలు ఉండవు. కృష్ణమ్మ రాకతో భూగర్భ జలాలు పెరుగుతాయి. సాగునీటికి, తాగునీటికి ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. బెంగళూరుకు వలస పోవాల్సిన పనిలేదు. చక్కగా వ్యవసాయం చేసుకుంటాం. మాకు అండగా నిలిచిన జగనన్ననే మళ్లీ గెలిపించుకుంటాం. – సుగుణప్ప, కొంగణపల్లె, రామకుప్పం మండలం

నేడు కుప్పంలో సీఎం పర్యటన



శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పర్యటించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే సీఎం కాన్వాయ్, హెలికాప్టర్ ట్రయల్ రన్‌లను విజయవంతంగా నిర్వహించారు.

పటిష్ట భద్రత

రేణిగుంట : తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జేసీ శుభం బన్సల్, ఎస్పీ మల్లికాగార్గ్ తెలిపారు. ఈ మేరకు అధికారులతో సమీక్షించారు. చిన్నపాటి తప్పిదాలకు సైతం తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9.35 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి చేరుకుంటారు. అనంతరం హెలికాప్టర్‌లో కుప్పం పర్యటనకు బయలుదేరుతారు.
- 10:25 గంటలకు రామకుప్పం మండలం రాజుపేటకు చేరుకుంటారు.
- 10.40 గంటలకు హంద్రీ–నీవా నీటిని విడుదల చేస్తారు.
- 11.15కు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 11.25కు గుండిశెట్టిపల్లివద్ద బహిరంగ సభ స్థలికి చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 1.15గంటలకు హెలికాప్టర్‌లో రేణిగుంటకు బయలుదేరుతారు.
- 2.20 గంటలకు బయలుదేరి రేణిగుంటకు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు.



సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

అవార్డు గ్రహీతలకు అభినందన



అవార్డు అందుకున్న విద్యార్థులతో మంత్రి రోజా

నగరి : రోడ్ స్కేటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరచి రికార్డులు, అవార్డులు సాధించిన విద్యార్థులను మంత్రి ఆర్‌కే రోజా అభినందించారు. మంత్రి మాట్లాడుతూ 'ఆడపిల్లలను చదివిద్దాం- ఆడపిల్లలను రక్షిద్దాం, ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం- భూగర్భజలాలను కాపాడుదాం, అనాథను ఆదరిద్దాం- బాల కార్మికులను నిరోధిద్దాం' అనే నినాదాలతో రోడ్ స్కేటింగ్ చేపట్టి క్రీడల్లోనూ సామాజిక దృక్పథాన్ని చాటిచెప్పడం ప్రశంసనీయమని కొనియాడారు. కోచ్ మధు మాట్లాడుతూ తాడిపత్రి శ్రీరమణ మహర్షి అనాథ పిల్లల రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇషాక్, యోగేంద్ర, పృథ్వీ, రామ్‌చరణ్, భార్గవ, శ్రీరామ్, తరుణ్ ఈ నెల 12వ తేదీన తక్కువ సమయంలోనే 750 కిలోమీటర్ల స్కేటింగ్ చేసి సత్తాచాటినట్లు వెల్లడించారు. ఈ మేరకు 15వ తేదీన అవార్డు అందుకున్నారన్నారు. ఈ ప్రయాణంలో అనుమతులు ఇప్పించి సహకరించిన మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. స్కేటింగ్ చేసిన విద్యార్థులు లను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో స్కేటింగ్ సౌత్ జోన్ సెక్రటరీ బి.ప్రతాప్ పాల్గొన్నారు.

28న సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో 28వ తేదీన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామివారి ఆస్థాన మండపంలో వ్రతం జరిపించనున్నట్లు వెల్లడించారు. పాల్గొనేందుకు టికెట్ తీసుకున్న భక్తులకు పూజాసామగ్రిని ఆలయం తరఫున అందిస్తున్నట్లు వివరించారు.

చిత్తూరులో తమ్ముళ్ల తిరుగుబాటు!

- గురజాల జగన్‌మోహన్ ఎంపికపై ధిక్కారం
- తమను వాడుకుని వదిలేశారని కాపుల ఆగ్రహం
- బీసీలను మోసం చేశారంటూ వన్నియర్ల మండిపాటు

చిత్తూరు అర్బన్: చిత్తూరు తెలుగుదేశం పార్టీలో తేనెతుట్టె కదిలింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు చిత్తూరు అసెంబ్లీ సెగ్మెంట్ అభ్యర్థిగా ఇటీవల ప్రకటించిన గురజాల జగన్‌మోహన్ నాయుడుకు సహాయ నిరాకరణ చేయాలని పార్టీలోని పలువర్గాలు తీర్మానించుకున్నాయి. ఓ వైపు వన్నియకుల క్షత్రియులు (నాయకర్లు), మరోవైపు బలిజ (కాపు) నాయకులు టీడీపీ అధిష్టానంపై మండిపడుతున్నారు. ఆదివారం సామాజిక మాధ్యమాల వేదికగా నిరసన గళం విప్పారు.

వన్నియర్లకు షాక్!

వైఎస్సార్‌సీపీ వన్నెకుల క్షత్రియుడైన సిపాయి సుబ్రమణ్యానికి ఎమ్మెల్సీ స్థానం ఇచ్చి గౌరవించింది. ఇదే సామాజికవర్గానికి చెందిన సీఆర్ రాజన్ చిత్తూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ నుంచి టికెట్ ఆశించారు., వైఎస్సార్‌సీపీలో సిపాయికి దక్కిన గౌరవాన్ని తమ పార్టీ నేతలతో ప్రస్తావించారు. గత ఆర్నెళ్లుగా సీఆర్ రాజన్ తమ సామాజికవర్గానికి చెందిన నేతలను కలుస్తూ, పలువురికి చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువాలు కప్పించారు. చిత్తూరులో ఓ కార్యాలయాన్ని సైతం ప్రారంభించుకున్నారు. తీరా జగన్‌మోహన్ నాయుడుకు టికెట్ ఇవ్వడంతో రాజన్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. జయహో బీసీ అంటూ నినదించి, చివరకు ఓసీలకు కొమ్ముకాశారంటూ నాయకర్ల సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు టీడీపీకి చెందిన వన్నెకుల క్షత్రియ నేత విజయ్‌కుమార్ తదితరులు సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తి పోస్తున్నారు. మూడు రోజుల్లో జిల్లాలోని నాయకర్లతో కలిసి శ్రీకాళహస్తి నుంచి కుప్పం వరకు బస్సుయాత్ర చేపట్టి, బీసీలకు జరిగిన అవమానం, అన్యాయంపై నిరసన తెలియజేయనున్నట్లు ప్రకటించారు.



గురజాల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ పెట్టిన పోస్టు

కాకమీదున్న కాపులు

మరోవైపు చిత్తూరు టీడీపీ టికెట్ ఆశించిన కాపు సామాజిక వర్గ నాయకులు సైతం ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కటారి హేమలతకు టికెట్ ఇస్తారని అనుకుంటే.. ఆమెను నడిరోడ్డుపై వదిలేశారని కాపు నేతలు నిట్టూరుస్తున్నారు. కనీసం ఆదికేశవులు కుమార్తె తేజస్విని, కాజూరు బాలాజీని అభ్యర్థిగా ప్రకటించి ఉంటే బాగుండేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో చిత్తూరు నుంచి పోటీ చేయడానికి స్థానిక అభ్యర్థులు పనికిరారా..అంటూ పలువురు బలిజ నాయకులు మండిపడుతున్నారు. ఏది ఏమైనా టీడీపీ అభ్యర్థికి ఏమాత్రం సహకరించకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీతోనే బీసీల అభ్యున్నతి



బైక్ ర్యాలీలో విజయానందరెడ్డి



వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ : బీసీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం నగరంలోని డీఐ రోడ్డులో కన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంగారెడ్డిపల్లె నుంచి గాంధీబొమ్మ, చర్చివీధి మీదుగా సభావేదిక వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఇద్దరికి ఎమ్మెల్సీ పదవులు సైతం ఇచ్చారని, ఒకరిని రాజ్యసభకు పంపడంతోపాటు పార్టీ జిల్లా ఇన్‌చార్జి పదవి కూడా అప్పగించారని తెలిపారు. కులానికి వన్నె తెచ్చిన వాళ్లే వన్నెకుల క్షత్రియులను కొనియాడారు. వీరిని బెంగాల్ టైగర్లుగా అభివర్ణిస్తుంటారని చెప్పారు. కుప్పంలో చంద్రబాబుపై బెంగాల్ టైగర్‌ను బరిలో దింపుతున్నారని వెల్లడించారు. గెలిపిస్తే మంత్రి పదవి కూడా ఇస్తామని జగనన్న మాట ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని అన్ని పదవుల్లో 65శాతం బీసీలకు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వివరించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. అధికారదాహంతో బీసీలను హేళన చేశారని మండిపడ్డారు. అదే ముఖ్యమంత్రి జగనన్న బీసీలను గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. అన్నివర్గాలకు సమన్యాయం చేస్తూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని ప్రతిఒక్కరూ ఆశీర్వదించి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ భరత్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు గణేష్, వెంకట్, శశి, కుమార్, పిచ్చాండీ, ఆర్ముగం, అన్నామలై నాయకర్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- 1,434 మంది అభ్యర్థులు గైర్హాజరు



పరీక్ష కేంద్రంలోకి వెళ్లే అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం గ్రూప్-2 పరీక్షలు నిర్వహించారు. 20 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 9,411 మంది అభ్యర్థులకు గాను, 7,977 మంది హాజరయ్యారు. 1,434 మంది గైర్హాజరయ్యారు. చిత్తూరుకు సమీపంలోని అపోలో మెడికల్ కళాశాల, ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాలను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, పీవీకేఎన్, అపోలో మెడికల్ కళాశాల, సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను డీఆర్‌ఓ పుల్లయ్య తనిఖీ చేశారు. ఓ అభ్యర్థి తిరుపతిలో నారాయణ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా, పొరబాటున చిత్తూరులోని నారాయణ కళాశాలకు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. అయితే సదరు అభ్యర్థిని లోపలికి అనుమతించలేదని తెలిపారు.

క్లుప్తంగా

పది విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మార్చి 18వ తేదీ నుంచి 30 వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపించి, ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి, ఆ తర్వాత తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు వెల్లడించారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు


దుప్పికి చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి.

బంగారుపాళెం : మండలంలోని దండువారిపల్లెలో ఆదివారం ఉదయం కుక్కల దాడిలో ఓ దుప్పి తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు దుప్పిని రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. నలగాంపల్లె పశువైద్యశాలలో దుప్పికి చికిత్స చేయించారు. గాయాలు నయమైన తర్వాత దుప్పిని అటవీప్రాంతంలో వదిలిపెడతామని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.



■ ఈమె పేరు కళావతి. కుప్పం మండలం, ఉర్లఓబనపల్లి గ్రామంలో నివసిస్తోంది. ఈ నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.6 లక్షల మేర లబ్ధిపొందింది. ఆమె కుటుంబ సభ్యులకు అమ్మఒడి, వృద్ధాప్య పింఛన్, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా తదితర పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోంది.



■ ఈమె పేరు బేబి. కుప్పం మండలం, ఊర్లఓబనపల్లి గ్రామం. వ్యవసాయ కూలీ. భర్త తాపీ మేస్త్రీ. సరైన కూలిపనులు దొరక్క గతంలో పొట్టచేత బట్టుకుని బెంగళూరు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్వగ్రామానికి వచ్చారు. వివిధ సంక్షేమ పథకాల కింద ఇప్పటివరకు రూ.4.6 లక్షల మేర లబ్ధి చేకూరినట్టు ఆమె సంతోషంగా చెబుతోంది.



■ ఈమె పేరు సరోజమ్మ. కుప్పం మండలం, కొత్తఇండ్లు గ్రామం. ఆమె కుటుంబంలో మొత్తం 8 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రూ.6.93 లక్షల వరకు లబ్ధి చేకూరింది. గతంలో చాలా ఇబ్బందులు ఉండేవని, ఇప్పుడు హాయి బతుకుతున్నామని ఆనందంగా వెల్లడిస్తోంది.

కుప్పం.. సంక్షేమ శోభితం

'ఇది పేదల ప్రభుత్వం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి. నాకు ఓటు వేయకపోయినా పర్వాలేదు.. అర్హులైతే చాలు.. వారికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని పథకాలు అందించాలి'.. అంటూ బాధ్యతలు చేపట్టిన మొదట్లోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నాలుగున్నరేళ్లలో ఎంతో మంది నిరుపేదలకు ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేర్చారు. ఇందులో విపక్ష నేత చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేశారు. వివిధ సంక్షేమ పథకాల కింద ఏకంగా ఈ నాలుగున్నరేళ్లలోనే ఒక్క కుప్పం నియోజకవర్గానికే రూ.398.862 కోట్లమేర అందజేసి స్థానికుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. పథకాలు పొందిన పలువురు లబ్ధిదారులు సీఎం జగనన్న రుణం తీరుకునే సమయం ఆసన్నమైందని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన వెంటే నడుస్తామని ప్రతిన బూనుతున్నారు. – కుప్పం

- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు
- పేదల బతుకుల్లో నవరత్న వెలుగులు
- సర్కారు సాయంతో తగ్గుముఖం పట్టిన వలసలు
- ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న మహిళలు


లబ్ధిదారులకు ఆసరా పథకం కింద మెగా చెక్కు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ (ఫైల్)

జగనన్న వెంటే ఉంటాం



ఈ ఐదేళ్లలో జగనన్న నవరత్నాలు ద్వారా లబ్ధి పొందాం. మా కుటుంబానికి మొత్తం రూ.3.5 లక్షల వరకు వచ్చింది. ప్రధానం ఆరోగ్యశ్రీ మాకు తోడుగా నిలబడింది. మా అత్తగారి ఆపరేషన్, నాకు ప్రసవం సమయంలో ఆరోగ్యశ్రీ ఊపిరి పోసింది. వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, రైతు భరోసా, సున్నావడ్డీ, విద్యాదీవేన ద్వారా ఆర్థిక సాయం అందింది. జగనన్న మేలు ఈ జన్మలో మరువలేం.

– సుమతి, కొత్త ఇండ్లు

కుప్పం నియోజకవర్గంలో వివిధ పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్‌చేయూత	5,214	18.92
వైఎస్సార్‌కాపు నేస్తం	331	0.75
జగనన్న అమ్మఒడి	8426	29.64
జగనన్న విద్యాదీవెన	2,775	06.56
జగనన్న వసతిదీవెన	1,639	03.38
వైఎస్సార్ పెన్షన్ కానుక	9,300	66.88
జగనన్న చేదోడు	348	0.72
జగనన్న తోడు	6,522	06.52
వైఎస్సార్ వాహన మిత్ర	166	0.40
ఈబీసీ నేస్తం	47	0.117
వైఎస్సార్ రైతు భరోసా	14,094	34.03
వైఎస్సార్ ఆసరా	23,866	98.85
వైఎస్సార్ సున్నావడ్డీ	2,668	07.39
వైఎస్సార్ బీమా	72	0.92
బ్యాంక్‌లోన్లు	32,241	44.06
స్త్రీనిధి లోన్లు	63,093	54.84
ఉన్నతి	913	05.88
వైఎస్సార్ లా నేస్తం	6	0.06
హౌసింగ్	1,806	18.95
మొత్తం	1,16,827	398.862

వలస బాధ తప్పింది

కూలి పనుల కోసం నిత్యం రైలులో బెంగళూరికి వెళ్లి వచ్చేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక నవరత్నాలతో సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇస్తున్నారు. క్రమం తప్పకుండా నగదు జమచేస్తున్నారు. మా కుటుంబానికి వైఎస్సార్ పింఛన్, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా ద్వారా ఇప్పటివరకు రూ.4.6 లక్షల వరకు వచ్చింది. గ్రామంలో పాడి పశువులు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు కూలి పనుల కోసం బెంగళూరు వెళ్లే బాధ తప్పింది. ఆత్మగౌరవంతో జీవనం సాగించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– మునిరత్నం, సంగనపల్లి, గుడుపల్లె మండలం

బతుకులు మారాయి



సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో మా బతుకులు మారాయి. ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలతో మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వ హయాంలోనే పాల ధరలు పెరిగాయి. పాడిపశువులు పెంచుకుంటూ, నవర్నత పథకాలు అందుకుంటూ ఆనందంగా ఉన్నాం.

మునెమ్మ, సంగనపల్లె, గుడుపల్లె మండలం

ప్రతి ఒక్కరికీ లబ్ధి



జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరింది. మా కుటుంబానికి ఇప్పటివరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.4.5 లక్షల వరకు వచ్చింది. విద్యాదీవెన, వైఎస్సార్, ఆసరా, పెన్షన్, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ పథకాలు మా కుటుంబాన్ని ఎంతో ఆదుకున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పథకాలు పెట్టలేదు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– శివరంజని, కొత్తఇండ్లు, కుప్పం మండలం

పెరుమాళ్లపల్లెలో పరుష పందేలు


దూసుకుపోతున్న కోడె గిత్త

వెదురుకుప్పం : మండలంలోని పెరుమాళ్లపల్లెలో ఆదివారం పరుష పందేలు నిర్వహించారు. విశేషంగా అలంకరించిన కోడెగిత్తలను నిలువరించేందుకు యువత పోటీపడ్డారు. ఎడ్లకు కట్టిన పలకలను దక్కించుకునేందుకు ముందుకు ఉరికారు. పందేలను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు కేరింతలు కొట్టారు. పలక దక్కించుకున్నవారు విజయగర్వంతో చిందులేశారు.

అండర్ బ్రిడ్జిని ఢీకొన్న ప్రైవేట్ బస్సు


ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు

పుత్తూరు: వడమాలపేట మండలం ఎస్వీపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది గాయపడ్డారు. వివరాలు.. తిరుపతి నుంచి అరక్కోణం వెళుతున్న భారతి ప్రైవేట్ బస్సు మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి అండర్ బ్రిడ్జి గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు స్వల్పంగా గాయపడ్డ ప్రయాణికులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్‌లు పొందిన లబ్ధిదారులతో మంత్రి రోజా

నగరి : నియోజకవర్గంలో వివిధ అనారోగ్య, ప్రమాదాల కారణంగా బాధితులైన కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి రోజా ఆదివారం పంపిణీ చేశారు. నగరిలోని క్యాంపు కార్యాలయంలో మొత్తం 12 మందికి రూ.16 లక్షల చెక్కులను అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఆర్థిక సాయం అందుకున్న వారు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్రపు స్వారీ యాత్ర ప్రారంభం


హార్స్ రైడ్ యాత్రకు బయలుదేరిన ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి సిటీ: తిరుపతి ఎన్‌సీసీ 2ఏ ఆర్ అండ్ వీ రెజిమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ నగర్‌లో హార్స్ రైడ్ (గుర్రపు స్వారీ) యాత్ర ప్రారంభమైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సుమారు 300 కిలోమీటర్లు సాగే ఈ గుర్రపు స్వారీ యాత్ర ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమాండర్ వీఎం రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు 'న్యూ ఇండియా విజన్–2047 అమృత్ కాల్' నినాదంలో భాగంగా హార్స్ రైడ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ప్రారంభించామన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం, ఎన్‌సీసీపై యువతకు అవగాహన కల్పించడం, సామాజిక సేవ, దేశభక్తిని పెంపొందించడం, పశువులకు హెల్త్ క్యాంపులు నిర్వహించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. మొదటి రోజు యాత్రలో సుమారు 10 గుర్రాలతో ఎన్‌సీసీ క్యాడెట్లు యాత్రకు బయలుదేరుతున్నారని తెలిపారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ యోగేష్ దుగ్గకోటి, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సాహస యాత్ర స్ఫూర్తిదాయకం

ఏర్పేడు: గుర్రపు ప్రదర్శన, సాహస యాత్ర చాలా స్ఫూర్తిదాయకమని తిరుపతి ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ ప్రకాష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గుర్రపు ప్రదర్శన, సాహస యాత్ర కార్యక్రమం నిర్వహించారు. 30 మంది క్యాడెట్లతో కూడిన ఎన్‌సీసీ బృందం, 7 గుర్రాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. హార్డిల్స్‌తో కూడిన వివిధ రకాల గుర్రపు విన్యాసాలు నిర్వహించారు. ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ గుర్రాల లక్షణాలు, ఎన్‌సీసీ, ఆర్‌వీసీ పాత్ర, వాటి ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి ఎన్‌సీసీ అధికారి మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

– ఇద్దరి మృతి,..మరో ఇద్దరి పరిస్థితి విషమం

పలమనేరు : పట్టణ సమీపంలోని ఆర్‌టీఓ కార్యాలయం వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కర్ణాటకలోని కోలారు చెందిన నారాయణగౌడ కుటుంబీకులు తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో బయలుదేరారు. దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా కారు క్యాటిల్‌ఫామ్ వంతెన వద్ద ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు టాటా ఏస్ వాహనంలో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారులోని సురేఖ(26) అనే మహిళ అక్కడికక్కడే మరణించింది. అమ్ము(2) అనే చిన్నారి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించింది. కారులోని నారాయణ గౌడ(55), కార్తీక్(27) తీవ్రంగా గాయపడగా..వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనిల్(30) అనే వ్యక్తి మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం చిత్తూరుకు రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంటలు ఆర్పబోయి వ్యక్తి మృతి


మృతి చెందిన అంజాద్‌బాషా


చికిత్స పొందుతున్న ఆలీపాషా

గంగవరం : మండలంలోని మల్లేరు వద్ద ఆదివారం రాత్రి ఓ వాహనానికి అంటుకున్న మంటలు ఆర్పబోయి వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన హరి అనే రైతు కర్భూజా సాగు చేస్తున్నాడు. కర్ణాటకలోని శ్రీనివాసపురం నుంచి పుచ్చకాయల కోతకు కూలీలను తీసుకువచ్చాడు. రాత్రి ఐషర్ వాహనంలో కాయల లోడింగ్ చేయించాడు. ఈ క్రమంలో ఐషర్ పొలం దాటుతుండగా పైన విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. డ్రైవర్ బాబాజాన్ కిందకు దిగి మంటలు ఆర్పేందుకు కూలీలను పిలిచాడు. దీంతో అంజాద్‌బాషా55), ఆలీపాషా(45) అనే కూలీలు బిందెలతో మంటలు ఆర్పే ప్రయత్నించారు. అయితే టెంపోకి విద్యుత్ తీగలు తగిలిన విషయం గమనించకపోవడంతో ఇద్దరూ కరెంట్ షాక్‌కు గురయ్యారు. అంజాద్‌బాషా అక్కడికక్కడే మరణించగా, ఆలీపాషా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆలీపాషా పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- చిత్తూరులో 4, చెన్నైలో 2 సెంటర్లు ఏర్పాటు
- రేపటి నుంచి టెట్ పరీక్షలు


మాట్లాడుతున్న డీఈవో దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : టెట్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో దేవరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఏపీ టెట్ –2024 పరీక్షకు చిత్తూరు జిల్లాలో 4, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 6 వరకు టెట్ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. చిత్తూరు జిల్లాలో పలమనేరులోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల, చిత్తూరు సమీపంలోని ఆర్వీఎస్ నగర్లో ఉన్న ఎస్వీసెట్, మురకంబట్టు వద్దనున్న సీతమ్స్ కళాశాల, పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలో ఉన్న వేము ఇంజినీరింగ్ కళాశాల, చెన్నై కోవిలంబాకంలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, అలాగే వేలచ్చేరిలో ఉన్న ఎస్ఐవీఈటీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలన్నారు. ఆలస్యంగా వస్తే అనుమతి ఉండదని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే 8247838357, 7386408270, 9440458098లో సంప్రదించాలని కోరారు.

వైద్య రంగానికి పెద్ద పీట


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి తదితరులు

తిరుపతి తుడా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి పెద్దపీట వేశాయని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం చేతుల మీదుగా దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 5 నూతన ఎయిమ్స్ వైద్య కళాశాలలను జాతికి అంకితం చేశారు. అంతేకాకుండా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద దేశంలోని పలు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లకు గుజరాత్‌లోని రాజకోట్ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అందులో తిరుపతి జిల్లాలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు అనుబంధంగా రుయా ఆస్పత్రి ప్రాంగణంలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల భువన విజయం ఆడిటోరియంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు తదితరులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం అనంతరం ఉపముఖ్యమంత్రి, ఎంపీ, జేసీ సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాక్ శిలా ఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం శంకుస్థాపన చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా శ్వాస సంబంధిత ఎమర్జెన్సీ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లా ప్రసూతి అధికారి పార్థసారథి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి అరుణ సులోచన దేవి, డీపీఎంఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.